## 22.'నీమం" కోసం "నామం" పెడితే

"**నీమం** (నియమం) కోసం నామం పెడితే నామం నా కొంప తీసింది" అన్నాడట ఒక ఆకలి బాధితుడు. అదెలాగంటేను-

అలనాటి కాలంలో ఒకనాడు ఒకబాటసారి కాశీకి వెళ్తూ ఒక చోట ఉదయం బయలుదేరాడు. మధ్యాహ్నం భోజనానికి ఒక ఫలానా వూరు చేరుతాను అని లెక్క వేసుకుని నడక సాగించేడు. చేరబోయే ఆ వూళ్లో తనకి బాగా తెలిసిన ఒక కుటుంబం ఉంది. అంచేత ధీమాగా నడుచుకుంటూ ఆ వూరు సమీపించేడు. ఊరు చేరడానికి ముందు ఒక సెలయేరు దాటాలి. అక్కడి దాకా వచ్చేసరికి ఎండవల్ల బాగా అలసట వచ్చింది. స్నానంచేసి వెళ్లడం మంచిదే కాక సెలయేట్లో నీళ్లు చాలా ప్రలోభకరంగా ఉన్నాయి. అయిన ఆలస్యం ఎలాగా అయిందని బుజంమీద మూట సెలయేటి ఒడ్డున పెట్టి స్నానం చేసేడు. స్నానం చేస్తూ దైవధ్యానం చేసుకోడం నియమం కనక ఒడ్డుకి రాగానే "నీమం" ప్రకారం "నామం" పెట్టుకున్నాడు. నాలుగు అడుగులు నడిచి ఊరుపట్టుచేరి తనకి తెలిసిన ఇంటికీ చేరాడు. ఇంటి యజమాని చాలా మంచివాడే. అభ్యాగతిః స్వయం విష్ణుః అనుకొనే రకం. ఐతే వాళ్లింట్లో - స్నానం చేసిన వెంటనే 'నామం' పెట్టుకునే అలవాటు కాక; భోజనానికి కూర్చున్నప్పుడు బొట్టుపెట్టుకునే అలవాటు. అంచేత బొట్టు పెట్టుకుని కనిపించిన ఈ మొహాన్ని చూడగానే "బొట్టూ భోజనం అయిందిలే" అనుకొని, రెండు నిమిషాలపాటు ఆ కబురూ ఈ కబురూ చెప్పి, కుశల ప్రశ్నలు వేసి "కొద్దిగా విశ్రాంతి తీసుకో; ఇప్పుడే వస్తా" నని చెప్పి తను ఒక్కడూ లోపలికెళ్లి భోజనం చేసి వచ్చేశాడు. అలసట వల్ల నిద్ర పట్టేసిన బాటసారికి మళ్లీ ఒక గంట తరవాత ఆకలికి మెలకువ వచ్చింది. వసారాలో పక్కకి చూస్తే ఇంటి యజమాని ఒక మంచం మీద నిద్రపోతూ కనిపించేడు. అతనికి కూడా తనలాగే భోజనానికి ముందు కొద్దిగా అలసట కాబోలు అని కొంతసేపు ఊరుకున్నా ఆకలి అతన్ని ఎంతసేపో ఊరుకోనివ్వలేదు. అంచేత తెగించి ఇంటి యజమానిని లేపేడు.

"ఇంకా ఎండ దిగజారలేదు. మరి కొంచెంసేపు నిద్రపో" అన్నాడు ఇంటి యజమాని.

"అది కాదు; అపరాహ్ణం అయినట్టుంది; కొంచెం దేవతార్చన(భోజనం) చేసి మరీ నిద్రపోదామని-". అన్నాడు బాటసారి.

"అయ్యో నువ్వు భోజనం చేసే వచ్చావనుకున్నాను; నీ మొహంమీద నామం చూసి-"

అలాగ; ఆ బాటసారి అన్న మాట అది: "నీమం కోసం నామం పెడితే నామం నా కొంపతీసింది" అని.

✤ ✤ ✤

చాలా ఏళ్ల కిందట మాట. పతంజలి అని, నాకొక మిత్రుడు ఉండేవాడు. ఇతనూ నేను బి.ఎ.లో క్లాసుమేట్సు. బి.ఎ. చదువుతున్న నాటికే అతనికి ఇరవై రెండు వెళ్లేయి. ఆ రోజుల్లో పద్దెనిమిదేళ్లకే మొగపిల్లాడికి పెళ్లి చేసేసేవారు. పతంజలి తల్లితండ్రులు ఇతను బి.ఎ. మొదటి

ఏడాదిలోఉన్నప్పుడే పెళ్ళి చేసేస్తాం అన్నారు. పిల్ల కూడా సిద్ధంగానే ఉంది. ఎవరో కాదు. మేనమామ కూతురే. ఇతనికన్నా నాలుగేళ్ళు చిన్నది. కాని పతంజలి "వివాహో విద్యానాశాయ అన్నారు కదా. చదువు పూర్తికాందే పెళ్ళి చేసుకోను'' అనేసరికి తల్లిదండ్రులు అతని తెలివికి సంతోషించి ఇతను బి.ఎ. ఆఖరి పరీక్ష రాసే దాకా మరి ఆపూసు ఎత్తలేదు. మేనమామ ఉత్తరం రాస్తే కూడా "పిల్లాడి పరీక్షలు అవనీ'' అని సమాధానం రాసేరు.

ఆఖరి పరీక్ష ఆ ఏడాది ఏప్రిల్ పదో తేదీని జరిగింది. పదకొండో తేదీకల్లా పతంజలి మేనమామ రాసిన ఉత్తరం వచ్చింది"పిల్లా పిల్లాడూ ఒకరికొకరు బాగా తెలిసినవాళ్లే అయినా, ఈ రోజుల పద్ధతి గనక, వాళ్లిద్దరూ ఒకర్నొకరు చూసుకోడం మంచిది. పరీక్షలు అయిపోయాయి గనక, మా మేనల్లుడైనటువంటి పతంజలిని రేపు దశమీ బుధవారం ఉదయానికి ఒకసారి మా వూరికి పంపగోర్తాను'' అంటూను. అప్పటికి దశమీ బుధవారం సరిగ్గా పదిరోజులుంది.

పతంజలి తల్లిగారు ఆ ఉత్తరం తను చూసి "మావయ్య ఉత్తరం రాశాడు నాయనా; పెళ్లి కోడల్ని ఓసారి చూసిరా'' అంటూ ఇతని చేతిలో పెట్టింది.

పతంజలి ఆ ఉత్తరం చూసేసి 'చూద్దాంలే అమ్మా. ఇంకా పదిరోజులు టైముందిగా'

అని జేబులో పెట్టేసుకున్నాడు. ఆ సాయంకాలం నన్ను కాఫీహోటలుకి తీసికెళ్లేడు.

మర్నాడు వాళ్లమ్మ పతంజలితో ఈ సంగతి ప్రస్తావించి; "ఒక్కడివే వెళతావా నేను కూడా వచ్చేదా?''అన్నారు. ఇతనేమీ మాట్లాడలేదు "అయినా వాళ్లేమైనా నీకు కొత్తగనకనా! నువ్వు ఒక్కడివే వెళ్తే చాల్లే'' అన్నారు. ఆ సాయంకాలం కూడా పతంజలి నన్ను కాఫీహోట లుకి తీసికెళ్లేడు.

అలా, నవమీ మంగళవారం దాకా రోజూ తీసుకెళ్తాడని నాకు తోచింది.

మూడోనాడు పతంజలి వదినగారు అన్నది: "నువ్వు దశమీ బుధవారం నాటికి అక్కడికి వస్తున్నట్టు ఉత్తరం రాస్తానంటున్నారు, మీ అన్నయ్య''

"ఈ మాత్రం దానికి ఉత్తరాలూ టెలిగ్రాములూ ఎందుకు; నేను వస్తానని ఉత్తరం రాయకపోతే నన్ను వాళ్ల ఇంట్లో అడుగుపెట్టనివ్వరా ఏమిటి? అయినా, నేను వెళ్తానని నిర్ణయించుకుంటే కదా అలా రాయడానికి?'' అన్నాడు పతంజలి.

ఆ సాయంకాలం పతంజలి మా ఇంటికొచ్చి చాలా సేపు ఉన్నాడు. మా ఆవిడ టిఫినూ కాఫీ ఇచ్చింది. మాచెల్లెలు పతంజలిని పలకరించింది. "పెళ్లిటకదా?'' అంది. "మీ కాబోయే పెళ్లి కూతురెలా ఉంటుంది? తెలుపా నలుపా? పొట్టా, పొడుగా? లావా, సన్నమా?'' అని వివరాలడిగింది. "ఏమో, చూడాలి. నేనా శాల్తీని చూసి ఆరేళ్లయింది.'' అన్నాడు సిగ్గుపడుతూ, పతంజలి.

"వెళ్లక వెళ్లక వెళ్తున్నాను. ఏదైనా కొని తీసికెళ్తే బావుంటుంది. ఓ ఇరవై రూపాయలుంటే పట్టుకుపద'' అన్నాడు. బజారుకెళ్ళి ఒక మంచి పరికిణీ గుడ్డ, రవికె గుడ్డ, వల్లెవాటు కొన్నాం. నేస్తలింగం నడిగి డబ్బా కెమెరా ఎరువు తీసుకున్నాడు. ఒక రోల్ ఫిలిం కొన్నాం. "ఇవన్నీ మీ ఇంట్లో వుంచు. రైలుకి వెళ్తూ దారి ఇటే కనక అప్పుడు పట్టుకెళ్తాను. ఇప్పుడు ఇవన్నీ మా వాళ్లు ఎందుకు చూడాలి ? అందులోనూ ; మా వొదినగారు చూసిందంటే కమ్మలు కడుతుంది.'' అన్నాడు.

ఆ మర్నాడు వాళ్ల అన్నయ్య అడిగాడు, 'ఒరే పతంజలీ, నువ్వు లక్ష్మింపురం నుండి

వెంటనే ఒచ్చేస్తావా, లేకపోతే నాలుగురోజులు ఉంటావా? ఎందుకంటే నేనోమాటు విశాఖపట్నం వెళ్లాలి. ఇంట్లో నువ్వూ లేక నేనూ లేకపోతే నాన్నగారికి ఇబ్బంది - అందుకు.'

"నేనువెళ్లడం సంగతి ఇంకా నిశ్చయం కాలేదు. అయినా ఏళ్లతరబడి మనం చచ్చేమో బతికేమో పట్టించుకోని ఆ మామయ్య ఇలా ఓ కార్డు రాసేడోలేదో మీరంతా కట్టకట్టుకుని నా ప్రయాణం గురించి ఎందుకిలా కిందా మీదా పడిపోతున్నారు?" అన్నాడు పతంజలి.

"అదేంట్రా అంతమాట అనేశావు, పాపం!" అన్నాను; నాతో ఈ సంగతి చెప్పగానే. . "నాకు ఆత్రుతగా ఉందని తెలిస్తే బతకనియ్యర్రా ఒరే!" అన్నాడు. "ఇలా ఎన్నిసార్లు బెట్టు చేసినా బుధవారం తెల్లారగట్ట లేచి ఫస్టుబస్సుకి లక్షింపురం వెళ్తున్నానని చెప్పేస్తే చాలు." అన్నాడు, ఫెళ్లుమని నవ్వుతూ.

ఇలా ద్విపాత్రాభినయం లాంటిది చేస్తూ పతంజలి తన మనస్సులో సదా లక్ష్మిని జపిస్తూనే ఇంట్లో వాళ్లని మాత్రం సస్పెన్సులో ఉంచేడు.

నవమీ మంగళవారం మధ్యాన్నం మూడింటికి పతంజలి అన్నయ్య పనిచేసే ఆఫీసులో నాకేదో పని తగిల్తే వెళ్లేను. అతను నన్ను చూసి మొహం మాడ్చుకున్నాడు. "గొప్ప సావాసులే" అన్నాడు. "ఏం?" అన్నాను. "మా తమ్ముడు లక్షింపురం వెళ్లడంగురించిలే. వాడు వెళ్లననడంలో ఎవరిప్రమేయం ఎంతవుందో ఏంచెప్పగలం!" అన్నాడు. "నా ప్రమేయం ఏంలేదు. నేను వెళ్లమనే అంటున్నాను." అన్నాను. 'ఎందుకులే. ఇందాకానే లక్షింపురం నించి మనిషొచ్చేడు. మావాడు నల్లమేకని బలి ఇచ్చినా సరే మీ పిల్లని చేసుకోడు - అని కబురు పెట్టేసేను. అవును; ఎందుకూ నిష్ఠూరం? రేపు దశమీ, బుధవారం కదా. వీడు వెళ్లనూ వెళ్లక, కబురూ చేరక - వాళ్లు ఏమనుకుంటారు, పాపం!'అన్నాడు పతంజలి అన్నయ్య కరుణాకరం.

☼

***("ఆంధ్ర భూమి" డెయిలీ 19-12-90)***

★ *"పతంజలి పంతం" అనే టైటిల్‌తో 1952 లో "తెలుగు స్వతంత్ర"లో అచ్చయింది*

with the best complimens from :

# Sri Balaji Groundnut Oil Mill

**CHEEPURUPALLI**
**Vizianagram dist.**